నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 22 అక్టోబర్ 2024 | NAGARKURNOOL

# మాయ మాటలతో గద్దెనెక్కిన రేవంత్

- జంగ మాయిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

పెద్దమందడి, అక్టోబర్ 21 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రైతుభరోసా హామీని నెరవేర్చలేదని సోమవారం మండలంలోని జంగ మాయిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ 'రైతు బంధు వేయక పోవడానికి దివానే గాళ్లమా, దిమాక్ లేనోళ్లమా' అంటూ మాయమాటలు చెప్పి తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారన్నారు. ఇప్పుడేమో రైతు బంధు ఎగ్గొట్టి మోసం చేశాడన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే కాలంలో ప్రజలు, రైతులు గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పునరాలోచన చేసి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15వేల చొప్పున వానకాలం పంటకు రైతుభరోసా వేసి వారి చిత్త శుద్ధిని చాటుకోవాలన్నారు. లేకుంటే ముక్కు నేలకు రాసి తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామాధ్యక్షుడు సంజీవరెడ్డి, రైతులు కృష్ణయ్య, నర్సిం హారెడ్డి, వెంకటయ్య, యాదగిరి, రాములు, రాజు, జనార్దన్‌గౌడ్, లక్ష్మయ్య, వేమారెడ్డి, వెంకటయ్య, శ్యాంసుందర్, రాజేశ్, నరేశ్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, శాంతయ్య, భాస్కర్, శివ పాల్గొన్నారు.

# అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం

- బోధన, పరిశోధన, అభివృద్ధి రంగాలపై ప్రత్యేక దృష్టి
- పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్
- 'నమస్తే తెలంగాణ'తో మాటామంతి

ఇంటర్వ్యూ



బాధ్యతలు చేపడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 21 : పాలమూరు యూనివర్సిటీని దేశంలోనే అత్యుత్తమ వర్సిటీగా తీర్చిదిద్దుతామని, బోధన, పరిశోధన, అభివృద్ధి రంగాలకు ప్రాధాన్యమిస్తామని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయనతో 'నమస్తే తెలంగాణ' నిర్వహించిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. వీసీ అంటే వ్యవస్థలో ఒక భాగం.. వైస్ చాన్స్‌లరే వ్యవస్థ కాదని.. బోధన, బోధనేతర సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం, నాయకులతో కలిసికట్టుగా ముందుకు సాగుతానని తెలిపారు. ఈ మూడేండ్ల పదవీ కాలం పూర్తయ్యేలోగా యూనివర్సిటీని ఉన్నతస్థాయికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా యువతలో నైపుణ్యాల అభివృద్ధి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధి చూపే అంశాలపై దృష్టిసారిస్తామని తెలిపారు. మెరుగైన విద్యను అందించడంతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధనేతర ఖాళీల భర్తీకి కృషి చేస్తాం.. అన్ని రంగాల్లో కష్టాలు, అడ్డంకులు ఉంటాయని వాటిని అధిగమించేందుకు చర్యలు చేపట్టడం తోపాటు విద్యార్థులు, సిబ్బంది సమస్యలు, అవసరాలు తెలుసుకొని పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

**నమస్తే తెలంగాణ : యూనివర్సిటీలో మీ మొదటి ప్రాధాన్యత అంశాలు ఏమిటి?**

ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా మన పాలమూరు వాసులే ఉంటారు. అటువంటి పాలమూరుకు నేను వైస్‌ఛాన్స్‌లర్‌గా రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. యూనివర్సిటీలో మధ్య తరగతి, పేద వర్గాలవారే ఎక్కువ. మినిమం ఫెసిలిటీస్ కల్పించేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తా. ప్రశాంతమైన వాతావరణంలో విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందించడం, చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషిచేస్తా. పరిశోధనల తోపాటు ఎక్స్‌ట్రాకరిక్యులమ్ యాక్టివిటీస్ సెమినార్స్, వర్క్‌షాప్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షల్లో విజయానికి కావాల్సిన శిక్షణలు ఇవ్వడం, విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేలా చేయడమే మొదటి ప్రాధాన్యత.

**నమస్తే తెలంగాణ : కొత్త కోర్సుల ఏర్పాటుపై మీ అభిప్రాయం?**

కాలానికి అనుగుణంగా ఉన్న కోర్సుల్లో మార్పులు చేయడం, కొత్తవి ప్రవేశపెట్టడం కోసం విషయ నిపుణులతో ఎప్పటికప్పుడు ఆలోచనలు చేస్తా. నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులతో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏ మేరకు లభిస్తాయనే విషయాలన్నింటినీ క్రోడీకరించి అందుకు అనుగుణంగా అవసరాన్ని బట్టి కోర్సులు రూపొందిస్తాం. సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థుల ఉన్నతికి కావాల్సిన చదువుతోపాటు సంస్కారం నేర్పించే కోర్సుల ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

**నమస్తే తెలంగాణ : పీయూ అభివృద్ధి కార్యక్రమాలకు ఈ విద్యా సంవత్సరంలో రూ.వందకోట్లకు పైనే ప్రతిపాదనలు పంపించినా.. ప్రత్యేక నిధులు ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. ఆర్థిక పరిస్థితులను ఎలా అధిగమిస్తారు?**

ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటాం. యూనివర్సిటీ అకాడమిక్, పరిపాలన, మౌలిక సదుపాయాల పరంగా అన్ని రంగాల్లో పీయూ అభివృద్ధి చెందేలా కృషిచేస్తాం. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా, జేఎన్టీయూ వర్సిటీల్లో పనిచేసిన అనుభవం ఇక్కడ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో పనిచేసిన రిజిస్ట్రార్స్, వైస్‌ఛాన్స్‌లర్స్ వారి సహాయ సహకారాలు తీసుకుంటాం. ప్రజాప్రతినిధులు, నాయకుల కోఆర్డినేషన్‌తో పీయూకు అధిక నిధుల సమీకరణకు కృషిచేస్తాం.

**నమస్తే తెలంగాణ : అత్యవసర వైద్యం అందని ద్రాక్షగానే మారింది. రెగ్యులర్ వైద్యుడు, సిబ్బంది లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.. మీరేం చేస్తారు?**

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో క్రీడల్లోనూ రాణించగల్గుతారు. ఇందుకు అనుగుణంగా వారి ఆరోగ్య సంరక్షణ, శ్రేయస్సులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేదిలేదు. అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుతాం. అత్యవసర వైద్య సేవలకు అవసరమైన అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తాం.

**నమస్తే తెలంగాణ : బోధనేతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నది. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో తాత్కాలిక సిబ్బందితోనే కొనసాగిస్తున్నారు. వారు సైతం చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు.. వాస్తవమేనా?**

టీడీపీ హయాంలోనే బోధనేతర సిబ్బంది నియామకాలపై ఆంక్షలు ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఇదే సమస్య ఉన్నది. పనిచేస్తున్న వారు రిటైర్మెంట్ అవుతున్నారే కానీ కొత్తగా ఎవరినీ తీసుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు కృషిచేస్తాం. బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి నా పరిధిలో పరిష్కరించే వాటన్నింటికీ వందశాతం పరిష్కారం చూపిస్తాను.

**నమస్తే తెలంగాణ : క్రీడల నిర్వహణకు ప్రత్యేకంగా సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసినా.. అథ్లెటిక్ కోచ్ లేరు. కేవలం ఒక ఫిజికల్ డైరెక్టర్‌తో క్రీడావిభాగాన్ని కొనసాగిస్తున్నారు. వివిధ కేటగిరీల్లో కోచ్‌ల అవసరం ఉన్నది.. దీనిపై మీ అభిప్రాయం?**

చదువుతోపాటు క్రీడలకూ సమప్రాధాన్యత ఇస్తాం. సింథటిక్ ట్రాక్ పూర్తిస్థాయిలో పెవిలియన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి పనులు పూర్తయ్యాక వివిధ కేటగిరీల్లో శిక్షకుల నియామకాలకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదిస్తాం. పాలమూరు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవసరమైన ప్రణాళికలతో ముందుకు సాగుతాం.

**నమస్తే తెలంగాణ : చివరగా యువతకు మీరిచ్చే సలహాలు, సూచనలు?**

యువత ఏదైనా సాధించాలంటే ఆత్మవిశ్వాసం ముఖ్యం. చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి. చదువుకోవాలనే కోరిక నిరంతరం రగులుతూ ఉండాలి. రోజూ అభ్యసనం ముఖ్యం. పరీక్షల సమయంలోనే చదివి ఉత్తీర్ణులవ్వాలనే తీరు మార్చుకోవాలి. నిర్దేశించుకున్న లక్ష్యం ఎదుట కష్టాలు, సమస్యలు చాలా చిన్నవి.. సమస్యలు పెద్దవిగా ఊహించుకుంటే లక్ష్యం నీరుగారి పోతుంది. కష్టపడినప్పుడే విజయం వరిస్తుంది. కష్టేఫలి అన్నది ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి.

# పాలమూరులో 189 కేంద్రాలు

- 1.99 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 21 : మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, సంస్థ ఆధ్వర్యంలో 189 సెంటర్ల ద్వారా కొనుగోళ్లుచేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈనెల మూడో వారంలో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నవంబర్ మొదటి వారంలో పూర్తిస్థాయిలో సెంటర్లు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్‌లో సాధారణ రకం 36,928 మెట్రిక్ టన్నులు, సన్న రకాలు 2,94,817 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇందులో సాధారణ రకం 22195 మెట్రిక్ టన్నులు, సన్న రకాలు 1,76,855 మెట్రిక్ టన్నులు మొత్తం 1,99,050 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. వీటిలో ఐకేపీ 95, పీఏసీసీఎస్ 89, ఇతర 5 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. గన్నీ బ్యాగులు 49.76 లక్షలు అవసరం ఉండగా 30.42 లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా 19.33 లక్షలు గన్నీ బస్తాలు అవసరం ఉన్నది. మొత్తం 74 మిల్లులకు ధాన్యం కేటాయించనున్నారు. ఇందులో రా రైస్ మిల్లింగ్‌కు 53 కేంద్రాలు, బాయిల్డ్ రైస్ మిల్లులు 21కి ధాన్యం కేటాయించారు. కాగా, ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,320 మద్దతు ధర కల్పించనున్నారు. అయితే, సన్న రకాలకు యాసంగి నుంచే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. ఈసారైనా బోనస్ ఇస్తే సన్నరకాలకు రూ.2,820 మద్దతు ధర దక్కనున్నది.



మహబూబ్‌నగర్ మార్కెట్‌లో ధాన్యం తూకం చేస్తున్న రైతులు (ఫైల్)

### కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి..



కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తాం. దళారులను నమ్మి మోసపోవద్దు. నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 24 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేశాం.

*- విక్రమ్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్, మహబూబ్‌నగర్*



గద్వాలలో కోత దశలో ఉన్న వరి పంట

# కొనుగోళ్లకు సన్నద్ధం!

- ధాన్యం సేకరణకు ప్రణాళికలు రెడీ
- మహబూబ్‌నగర్ జిల్లాలో 189, గద్వాల జిల్లాలో 55 కేంద్రాల ఏర్పాటు
- సన్నాలకు రూ.500 బోనస్‌పైనే రైతన్న ఆశలు



గద్వాల, అక్టోబర్ 21 : వానకాలంలో రైతులు పండించిన ధాన్యం దళారులకు అమ్మి నష్టపోకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఈ వానకాలం రైతులు పండించిన పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా యాసంగి సీజన్‌లోనే రైతులు పండించిన పంటకు బోనస్ ఇవ్వాల్సి ఉండగా.. ప్రభుత్వం ఇవ్వకుండా మొండిచేయి చూపించింది. సన్న, దొడ్డు రకానికి క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ వానకాలంలో రైతులు సాగు చేసిన వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని నిర్ణయించి సన్న, దొడ్డు వడ్ల కొనుగోలు కేంద్రాలు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక**

జిల్లాలో సాగు నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు పత్తి తర్వాత వరి పంటను ఎక్కువ మొత్తంలో సాగు చేస్తారు. వానకాలం సీజన్‌లో వర్షాలు సక్రమంగా కురువక పోవడంతో జిల్లాలో వరిసాగు తక్కువ మొత్తంలో రైతులు సాగు చేశారు. వానకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురువడంతో రైతులు 86,119 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. సాగు చేసిన రైతులు కేంద్రాలకు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కేంద్రాలకు తీసుకొస్తారని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. అందుకోసం పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో 21, ఐకేపీ ఆధ్వర్యంలో 34 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.500 బోనస్‌తో రైతులకు లబ్ధి**

ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన ధాన్యానికి బోనస్‌గా రూ.500 చెల్లిస్తే జిల్లాలోని రైతులకు రూ.50కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం వరి ధాన్యం ఏ-గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చెల్లించడం తోపాటు సన్నరకం వడ్లకు అదనంగా క్వింటాకు రూ.500 వరకు చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తుండడంతో రైతులకు కొంత మేర ఊరట కలిగే అవకాశం ఉన్నది.

# పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

- రాబోయే రోజుల్లో విద్యలో ఊహించని మార్పు
- పిల్లల కష్టం మీద ఆధారపడితే ఇబ్బందులు తప్పవు
- సినీనటి, పెగ టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచు లక్ష్మీప్రసన్న
- ఆలూరు ఎంపీపీఎస్‌లో స్మార్ట్ క్లాస్‌రూం ప్రారంభం



జోగుళాంబ గద్వాల కలెక్టర్, అధికారులతో సినీ నటి మంచు లక్ష్మీప్రసన్న




గట్టు : సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మీప్రసన్న

గట్టు, అక్టోబర్ 21: పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చే బాధ్యత తమదేనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలని సినీనటి, పెగ టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచు లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని ఆలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూంను సోమవారం ప్రారంభించారు. అంతకుముందు మంచులక్ష్మికి సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంచులక్ష్మి మాట్లాడారు. అక్షరాస్యతలో గట్టు వెనుకబడిందనే మాటను అందరూ తమ మదిలో నుంచి తీసివేయాలని విజ్ఞప్తి చేశారు. గట్టు మండలంలో పిల్లల కష్టం మీద తల్లిదండ్రులు ఆధారపడుతుండడం బాధాకరమన్నారు. ఈ పద్ధతి నుంచి తల్లిదండ్రులు దూరం కావాలని కోరారు. గట్టు మండలంలో విద్యాభివృద్ధిని తమ టీచ్ ఫర్ ఛేంజ్ సంస్థ సవాల్‌గా తీసుకోనున్నదని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 23 స్మార్ట్‌క్లాస్‌రూంలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామాల్లో కూడా వీటిని సమకూర్చుతామన్నారు. అన్నిదానాల్లో విద్యాదానం గొప్పదని, దీని వల్ల మేథోసంపత్తి పెరిగి కుటుంబాల జీవన ప్రమాణాల్లో సమూల మార్పు వస్తుందన్నారు. మనుషులను పక్కన పెడితే, దేవుళ్లకు కూడా కష్టాలు తప్పలేదని, అయితే వాటిని అధిగమించి భవిష్యత్‌ను బాగు చేసుకుంటేనే ఫలితం ఉంటుందన్నారు. కొందరి జీవితాలను చూస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతుంటాయని, అయితే వారిని కూడా తమలో భాగస్వాములను చేసుకుని సహాయ, సహకారాలు అందిస్తే మేలు చేకూరుతుందన్నారు. సమాజంలో చదువుకున్న విలువ దేనికిలేదని, దీన్ని గ్రహించి విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకు సాగితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. గట్టు మండలంలో విద్యాభివృద్ధికి సహకారం అందిస్తుండడం జీవితంలో మరువలేని అంశమన్నారు. కార్యక్రమంలో పెగ సిస్టమ్స్ అధినేత ధరణికోట సుయోధన్, డీఈవో రవీందర్, విద్యాశాఖ జిల్లా సమన్వయ అధికారులు ఎస్తేర్‌రాణి, హంపయ్య, కార్యాలయ పర్యవేక్షణ అధికారి రామకృష్ణారావు, ఎంఈవో నల్లారెడ్డి, హెచ్‌ఎం రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి సహకారమందిస్తాం : కలెక్టర్

గద్వాల, అక్టోబర్ 21: జిల్లాలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వపరంగా స్వచ్ఛంద సంస్థకు ఎల్లప్పుడూ పూర్తిస్థాయి సహకారం అందిస్తామని కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో టీచ్‌ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మంచులక్ష్మి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధికి ముఖ్యంగా గట్టు మండలంలో టీచ్‌ఫర్ చేంజ్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న పాఠశాలలన్నింటిని నేరుగా సందర్శిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కొత్తగా 140మంది ఉపాధ్యాయులను నియమించినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఉత్తమ విద్య అందించే విధంగా విస్తృతంగా పర్యటించి పరిశీలించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ పరుగులు

- జూరాల డ్యాం 16 గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల
- టీబీ డ్యాంకు 29 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 21: కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. సోమవారం జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండడంతో 16 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు ఇన్‌ఫ్లో 1,13,000 క్యూసెక్కులు ఉండగా, స్పిల్‌వే ద్వారా 82,980 క్యూసెక్కులు విడదల చేస్తుండగా, మొత్తం అవుట్ ఫ్లో 1,19,696 క్యూసెక్కులు నమోదైంది. ఎడమ కాల్వకు 640, కుడి కాల్వకు 720, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 34,559 క్యూసెక్కుల నీటితో ఐదు యూనిట్లలో విద్యుత్పత్తి చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.275 టీఎంసీల నిల్వ ఉంది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 55,593 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 55,593 క్యూసెక్కులు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటిమట్టం 1,705 అడుగులకుగానూ 1,704.66 అడుగులు ఉన్నది. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 88,503 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 91,037 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1,615 అడుగులకుగానూ ప్రస్తుతం 1,614.01 అడుగులు ఉన్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 29,834 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 29,336 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.421 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 43,627 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 43,000 క్యూసెక్కులు ఉన్నది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 627 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 10.8 అడుగుల మేరకు నీటిమట్టం ఉన్నది.



జూరాల ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

# ఏఎస్సైపై కుక్కల దాడి

- జోగుళాంబ ఆలయం వద్ద ఘటన

అయిజ, అక్టోబర్ 21 : అలంపూర్ పట్టణంలోని జోగుళాంబ ఆలయ పరిసరాల్లో ఏఎస్సై ఎస్‌ఎం బాషాపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఆదివారం రాత్రి బందోబస్త్ నిమిత్తం ఆలయానికి చేరుకుని తిరిగి వస్తున్న ఏఎస్సైపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆయన కాలుకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఏఎస్సై బాషా తెలిపారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కలు పట్టి సుదూర ప్రదేశాలకు తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కుక్కదాడిలో గాయాలపాలైన ఏఎస్సై బాషా

# అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- జోగుళాంబ జోన్ డీఐజీ చౌహాన్
- పాలమూరులో అమరుల స్తూపం వద్ద నివాళి అర్పించిన కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి
- ఎస్పీ కార్యాలయంలో పోలీసు అమరవీరుల దినోత్సవం



జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ కలెక్టర్, ఎస్పీ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 21 : విధినిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి స్ఫూర్తి నిత్యం మనతో ఉంటుందని జోగుళాంబ జోన్ 7 డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎప్పటికీ రుణపడి ఉంటుందని, వారి సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తామని తెలిపారు. 30 ఏండ్ల కిందట ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని, గతంలో పోలీసులు విధినిర్వహణలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కొనియాడారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో పోలీస్ ఫ్లాగ్ డే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల స్తూపం వద్ద కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, పోలీసు అధికారులతో కలిసి డీఐజీ నివాళులర్పించారు. అంతకుముందు ఎస్పీ మాట్లాడుతూ ఏడాది కాలంలో దేశంలో అమరులైన 214 మంది పోలీస్ అధికారులు ఉగ్రవాదులు, తీవ్రవాదులతో పోరాడి దేశ రక్షణ కోసం అమరులయ్యారని.. ఈ పోలీస్ అమరవీరుల త్యాగాలను మనమందరం అనుక్షణం స్మరించుకుంటూ దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆకాంక్షించారు. పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తారన్నారు. పోలీసులకు విశ్రాంతి అవసరమన్నారు.

జిల్లా నుంచి అమరులైనవారి కుటుంబాలతో డీఐజీ, కలెక్టర్, ఎస్పీ కలిసి ఏమైనా సమస్యలున్నాయా అని తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు, సైకిల్ ర్యాలీ, రక్తదానం శిబిరం నిర్వహిస్తామన్నారు.

**పాలమూరులో శాంతి ర్యాలీ..**

అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి ర్యాలీని డీఐజీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డీఐజీ, ఎస్పీ తోపాటు అమరవీరుల కుటుంబ సభ్యులు పాదయాత్రగా వన్‌టౌన్ చౌరస్తాలో ఉన్న పరదేశినాయుడు విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించిన తర్వాత అమరవీరుల ఆత్మ శాంతి కోసం పోలీసు సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఎఆర్ ఏఎస్పీ సురేశ్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.